www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 26 మే 2025
5
అన్నమయ్య



నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

చకచకా మహానాడు ఏర్పాట్లు



- పసుపు మయంగా మారిన కడప
- ఫుడ్‌జోన్‌, మహాసభ, పార్కింగ్‌ వసతులపై శ్రద్ధ
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రోజువారీ సమీక్షలు
- 23 వేల మందితో ప్రతినిధుల సభ
- ఐదు లక్షల మందితో మహాసభ నిర్వహణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో మహానాడు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి తొలిసారిగా కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పబ్బాపురం సమీపంలోని 145 ఎకరాల విస్తీర్ణంలో మహానాడును నిర్వహిస్తోంది. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో మహానాడు నిర్వహిస్తున్నామని ప్రకటించింది. టిడిపి రాష్ట్ర నాయకత్వం మహానాడు కార్యక్రమ నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మహానాడు నిర్వహణ తేదీలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు జిల్లాలోనే మకాం వేసి మహానాడు ఏర్పాట్లపై దృష్టి సారించించారు. ఆయనకు తోడుగా ప్రతిరోజూ ముగ్గురు, నలుగురు మంత్రులు పరిశీలించడం, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర సీనియర్ల సలహాలు, సంప్రదింపులు, సూచనలు, పర్యవేక్షణలతో ముందుకు సాగుతోంది. రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గుండు సుధారాణి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బిసి జనార్ధన్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, ఆర్.మాధవి, పుత్తా చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, బిటెక్ రవి, అన్నమయ్య జిల్లా టిడిపి ఇన్‌ఛార్జి జగన్‌మోహన్‌రాజు తదితరులు ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు.

వసతి సదుపాయాల కల్పనపై దృష్టి

ప్రతినిధుల సభకు 23 వేల మంది హాజరు కానున్నారు. అవసరమైన వేదిక ఏర్పాట్లు, భోజన వసతి, పార్కింగ్ సదుపాయాలపై దృష్టి సారించారు. చివరి రోజైన 29న ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ మూడు రోజులపాటు కడపలోనే ఉండడనున్నారు. పార్టీ నాయకత్వం, కలెక్టర్, జెసి, ఎస్‌పి, రాయలసీమ డిఐజి కోయ ప్రవీణ్, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా ముఖ్యమంత్రి బస, మహానాడు వేదిక ఏర్పాట్లు, భద్రత తదితర వ్యవహారాలపై ప్రధానంగా దృష్టి సారించారు. ఫుడ్‌జోన్, పార్కింగ్ తదితర ఏర్పాట్లు క్లైమాక్స్ దశకు చేరుకున్నాయి.



కడప నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు

పకడ్బందీ నిర్వహణపై కసరత్తు

ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో మహానాడు ఏర్పాట్లు, వసతి సదుపాయాలపై రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. మహానాడుకు ఎంతమంది జనాభా హాజరవుతారు. వచ్చిన వారికి భోజన వసతుల ఎక్కడ ఏర్పాటు చేయాలి, ఏయే ప్రాంతాల వారి వాహనాలకు ఎక్కడెక్కడ పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఇతర సదుపాయాల కల్ప నలో ఎక్కడా లోటుపాట్లు తలెత్తకుండా చూడాలనే దిశగా ఆలోచనలు సాగిస్తున్నారు.

కడప గడపలో పసుపు శోభ

టిడిపి మహానాడు సందర్భంగా కడప నగరమంతా పసుపు శోభను సంతరించుకుంది. కడప నగరంలోని ప్రధాన రహదారులు, ప్రధాన కూడళ్లన్నీ పసుపుజెండాలు, ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్ ఫొటోలతో కూడిన భారీ ఫ్లెక్సీలతో దర్శనమిస్తోంది. కడప నగరంలోని రహదారుల గుంతలు పూడ్చివేత, రహదారులను వెంబడి డివైడర్లకు మార్కింగ్ వేయడం వంటి పనులు శరవేగంగా సాగుతున్నాయి.

కరోనా కలకలం మధ్య

ప్రత్యర్థి నేత జగన్ ఇలాఖాలో టిడిపి ప్రతిష్టాత్మకంగా మహానాడు నిర్వహిస్తోంది. ఎటువంటి పొరపాట్లు దొర్లినా రాజకీయ విమర్శలకు ఆస్కారం ఏర్పడుతుంది. గతంలో కృష్ణా పుష్కరాలు, ప్రకాశం జిల్లా తొక్కిసలాట వంటి ఘటనలు మచ్చగా మారిన నేపథ్యంలో పకడ్బందీ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాలో కరోనా అనుమానాస్పద కేసు నమోదైన నేపథ్యంలో మహానాడును విరమించుకోవాలనే డిమాండ్ల నేపథ్యంలో ముందుకు సాగుతున్న నేపథ్యం రాజకీయ విమర్శలకు ఆస్కారం ఏర్పడిన నేపథ్యం తెలిసిందే.

వాహన పార్కింగ్‌పై దృష్టి

ట్రాఫిక్ నిర్వహణపై ప్రధాన సమస్యగా మారనుంది. మహానాడు వేదికకు ఎదురుగా ఉన్న మైదానాలలో వాహన పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి కడప జిల్లాలోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున బహిరంగ సభకు వాహనాలు వచ్చే అవకాశం ఉంది. ఒక్కో నియోజక వర్గం నుంచి రెండు వేల నుంచి మూడు వేల వాహనాలు వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన 29 నాటి బహిరంగ సభకు జిల్లాలోని 11 నియోజకవర్గాల నుంచి సుమారు 25 వేల వాహనాలు, రాష్ట్రంలోని 26 జిల్లాలు, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి సుమారు 50 వేల వరకు వాహనాలు వచ్చే అవకాశం ఉంటుంది. వీటన్నింటికీ వసతి సదుపాయాల కల్పన చేయడం ఎలా అనే కోణంలో చర్చిస్తోంది.

'మహా' జన సమీకరణలో 'దేశం'

- భారీ బహిరంగసభ నిర్వహణకు యత్నం
- ఐదు లక్షల మంది హాజరుపై దృష్టి
- అసెంబ్లీకి 50 వేల చొప్పున టార్గెట్
- రాజంపేట నుంచి భారీగా జనహాజరు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టిడిపికి రాష్ట్ర మహానాడు నిర్వహణ ప్రతిష్టాత్మకంగా మారింది. జిల్లాలో కరోనా విజృంభిస్తుందనే పేరుతో మహానాడు నిలిపేయాలని వైసిపి కోరుతున్న నేపథ్యం తెలిసిందే. దీంతో అధికార టిడిపి నాయకుల్లో మహానాడు నిర్వహణపై పట్టుదలను మరింత పెంచింది. ఇందులోభాగంగా టిడిపి అధిష్టానం విమర్శల జడవక నిర్వహణ కమిటీలను క్రియాశీలం చేసింది. దీంతో కడప, అన్నమయ్య జిల్లా పార్లమెంట్ ఇన్‌ఛార్జిలపై జన సమీకరణ భారం పడింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మంత్రుల దగ్గర నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు ప్రతిష్టాత్మకంగా తీసుకుని వరుసగా సమీక్షలు నిర్వహిస్తూ మూడ్రోజుల మహానాడు కార్యక్రమాన్ని జయ ప్రదంగా నిర్వహించడంపై మరింతగా దృష్టి కేంద్రీకరించింది.

కడప జిల్లాలో టిడిపి రాష్ట్ర మహానాడు నిర్వహణపై అందరి దృష్టి నిలిచింది. ప్రత్యర్థి నేత వైఎస్ జగన్ సొంత జిల్లాలో మహానాడును జయప్రదం చేసి తీరాల్సిన అనివార్యమైన పరిస్థితి ఏర్పడింది. టిడిపి మహానాడు నిర్వహణలో చిన్నపాటి తప్పిదం దొర్లినా ప్రత్యర్థుల రాజకీయ విమర్శకు ఆయుధాన్ని చేతులారా ఇచ్చినట్లు అవుతుందనడంలో సందేహం లేదు. మహానాడు జయప్రదం కావడంలో ప్రధానంగా జన సమీకరణ అంశమే గీటురాయిగా మార నుంది.

భారీ జన సమీకరణపై కన్ను

ఉమ్మడి కడప జిల్లాలోని 11 అసెంబ్లీలపై జన సమీకరణ కస రత్తు ఊపందుకుంది. ఇందులో ప్రధానంగా కడప, అన్నమయ్య జిల్లా టిడిపి ఇన్‌ఛార్జులు బహిరంగసభకు పెద్దఎత్తున జన సమీకరణ చేయాల్సి ఉంది. ఉమ్మడి కడప జిల్లాలోని 11 అసెంబ్లీ నియోజక వర్గాల నుంచి పెద్దఎత్తున జన సమీకరణ చేయడంపై టిడిపి దృష్టి సారించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 50 వేల మంది చొప్పున సేకరించాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది. ఉమ్మడి కడప జిల్లా లోని కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు అసెం బ్లీల నుంచి 5.50 లక్షల మంది జనాభా సేకరణపై అంచనా వేసుకుంది. ఇందులో కొన్ని నియోజకవర్గాల నుంచి 30 వేలకు జనాభా సేకరణ తగ్గితే, ఆ లోటును భర్తీ చేయడానికి అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి, పీలేరు, వాయల్పాడు అసెంబ్లీల నుంచి భర్తీ చేస్తే లక్ష్యాన్ని సులువుగా చేరుకునే అవకాశం ఉందనే ధీమా కనిపి స్తోంది.

జగన్మోహనుని ముద్ర కనిపించేనా

రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జి జగన్మోహన్‌రాజు మహానాడు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు కనిపిస్తోంది. కడప జిల్లా జన హాజరుకు ధీటుగా అన్నమయ్య జిల్లా ముద్ర కనిపించేలా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులోనూ రాజంపేట అసెంబ్లీ నుంచి భారీగా జన సమీకరణ చేస్తుండడం గమనార్హం. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట, రాయచోటి, మదనపల్లి, పట్టణాల్లోని ఎన్నికల సభలకు అన్నమయ్య జిల్లా నుంచి వందల వాహనాల ద్వారా భారీ జన సమీ కరణ చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి అనుభవం కలిగిన నేపథ్యంలో రాష్ట్ర మహానాడు నిర్వహణలో భాగమైన చివరి రోజు బహిరంగ సభకు ప్రతి అసెంబ్లీ నుంచి 50 వేల మందికి తగ్గని రీతిలో జనాభా సమీకరణలో నిమగ్నమైనట్లు కనిపిస్తోంది.

రాజంపేట నుంచి భారీగా తరలింపు

రాజంపేట నియోజకవర్గ వెహికల్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ ఆధ్వర్యంలోని రెండు వేల వాహనాలలో జనాభాను తరలించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమాచారం. ఇందులోభాగంగా రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జి జగన్మోహన్‌రాజు ప్రతి గ్రామం, పంచాయతీ, మండలం, నియోజకవర్గ కేడర్‌ను క్రియాశీలం చేయడం గమనార్హం. ఇదేతరహాలో అన్నమయ్య జిల్లాలోని మిగిలిన రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు, వాయల్పాడు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్ ఛార్జుల సహకారంతో జన సమీకరణపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఏదే మైనా కడప జిల్లా టిడిపి నాయకత్వం జన సమీకరణకు తగ్గకుండా అన్నమయ్య జిల్లా నుంచి భారీగా జనాన్ని తరలించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

మహానాడును జయప్రదం చేద్దాం

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : కడప నగరంలో జరగనున్న మహా నాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఆది వారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలకు మహానాడు పై దిశా నిర్దేశ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత పాలకుల ఇసుక దోపిడీ వల్లే అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయిందన్నారు. ఆనాడు జరిగిన వరద బీభత్సం వలన 41 మంది చనిపోతే నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కనీసం పరామర్శించలేదని, తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు రాలేదని విమర్శించారు. అతి త్వరలోనే అన్నమయ్య డ్యాం ను పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎన్‌టి.రామారావు నుంచి చంద్రబాబు వరకు రాయలసీమకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఇరిగేషన్ రంగంలో తెలుగు గంగ, జిఎన్‌ఎస్‌ఎస్, హెచ్‌ఎల్‌సి వంటి ఎన్నో ప్రాజెక్టులు టిడిపి హయాంలోనే నిర్మించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మిగతా ప్రాంతాల కంటే రాయలసీమలోని హంద్రీనీవా ప్రాజెక్టుకే అత్యధికంగా బడ్జెట్‌లో రూ.3240 కోట్లు చంద్రబాబు కేటాయించారని అన్నారు. ఒంటిమిట్టలో భూకబ్జాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ యువనేత లోకేష్ సారథ్యంలో జరుగుతున్న మహానాడు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. పార్టీ శ్రేణులకు స్వయంగా లోకేష్ బాబు దిశా నిర్దేశం చేయనున్నారని అన్నారు. మహానాడులో లోకేష్ కార్యకర్తలతో ముఖాముఖి మాట్లాడనున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి : మంత్రి

ప్రజాశక్తి - కడప అర్బన్ : మున్సిపాలిటీల పరిధిలో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ లోని విసి హాల్లో ఇంటి పన్నులు, పన్నుల డిమాండ్, అసెస్మెంట్, టౌన్ ప్లానింగ్ అంశాలపై ఉమ్మడి జిల్లా మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భ ంగా మంత్రి మాట్లాడుతూ నగరపాలక సంస్థ, మున్సిపాల్టీల పరిధిలోని అన్ని విభాగాలు సమన్వయంతో పన్నుల వసూళ్ల కోసం చిత్తశుద్ధితో పనిచే యాలన్నారు. ప్రధానంగా ఆస్తి పన్ను వసూళ్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికతో క్షేత్రస్థాయికి వెళ్లాలన్నారు. ప్రతి వార్డుకు సంబంధించి క్లస్టర్ స్థాయిలో పన్నుల జాబితాను, దీర్ఘకాలిక బకాయిల జాబితాను సిద్ధం చేసి, రోజూ డోర్ టు డోర్ వెళ్లాలన్నారు.వార్డు అడ్మిన్ కార్యదర్శులను సమన్వయం చేసుకుని పన్నులు వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. పన్నుల వసూళ్లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర నిధులపై ఆధారపడకుండా మున్సిపాలిటీల పన్నులను ప్రజలను ఇబ్బం దులకు గురి చేయకుండా వసూలు చేయాలన్నారు. ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించాలంటే పన్నులు వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బయటి అధికారులతో బద్వేల్, కమలాపురం అండర్ అసెస్మెంట్ లపై సర్వే చేయించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా మున్సిపాలిటీల ఆస్తి పన్నుల వసూళ్లు, జనాభా వివరాలు, మునిసిపాలిటీ పన్నుల డిమాండ్‌లు, మున్సిపాలిటీల వారిగా సమీక్షించారు.

విద్యా వ్యవస్థను విద్యార్థులే కాపాడుకోవాలి

ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు వి.పి.సాను



మాట్లాడుతున్న అఖిల భారత అధ్యక్షులు వి.పి. సాను

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యా వ్యవస్థ ప్రమాదంలో పడిందని, కాపాడుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదేనని అఖిల భారత అధ్యక్షులు వి.పి. సాను పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశం మదనపల్లెలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే సమావేశం ప్రారంభ సూచికగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర నలుమూలల నుండి హాజరైన ప్రతినిధులను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ అఖిలభారత జాతీయ అధ్యక్షులు మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పేదవారికి విద్య అనేది అందని ద్రాక్ష గానే మారిందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు విద్యార్థులకు విద్యను మరింత దూరం చేస్తుందని వాపోయారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యలో కాషాయీకరణ, కేంద్రీకరణ, కార్పొరేటీకరణను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తుందని, దీనిని విద్యార్థులందరూ గ్రహించి ప్రతిఘటించాలని తెలిపారు. గతంలో జరిగిన పుల్వామా దాడిలో దాదాపు 40 మంది సైనికులు ప్రాణత్యాగం చేస్తే వారి కుటుంబాలకు ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. కానీ ఆ దాడి ఘటనను 2019 ఎన్నికల ప్రచారంలో వాడుకొని లబ్ధి పొందారని తెలిపారు. ఇదే పద్ధతిని నేడు పహల్గాం ఉగ్ర దాడిలో కూడా కేంద్ర ప్రభుత్వం ఉపయోగించుకొని బీహార్ ఎన్నికలలో లబ్ధి పొందాలని చూస్తోందని పేర్కొన్నారు. భారత సైనికులు, ప్రజల మతదేహాలపై బిజెపి ఓట్ల వేట సాగిస్తుందని విమర్శించారు. 10 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం విద్యావ్యవస్థకు చేసిన మేలు శూన్యమని తెలిపారు. ఎప్పుడెప్పుడు విద్యావ్యవస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని చూస్తున్నారని అన్నారు. చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు లేకుండా ప్రభుత్వ సంస్థలు అన్నింటినీ కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందని విమర్శించారు. ఆఖరికి దేశాన్ని కాపాడే సైన్యంలో కూడా కాంట్రాక్ట్ పద్ధతిని ప్రవేశపెట్టిన ఘనత ప్రస్తుత కేంద్ర ప్రభుత్వానికే దక్కిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు విడనాడాలన్నారు. ఇదే సందర్భంలో రాష్ట్రంలో ఎంతోమంది ప్రాణత్యాగాల ఫలితంతో కాపాడుకుంటూ వస్తున్న ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రయివేట్ పరం చేసే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. పాఠశాలల మూసివేతను ప్రభుత్వం ఆపాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరి ంచారు. ఈ డిమాండ్ల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కషి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాల స్ఫూర్తితో భవిష్యత్తులో విద్యారంగ సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్లీనరీకి హాజరైన ప్రతినిధులు భగత్‌సింగ్, జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరమేష్, రామ్మోహన్, అబ్దుల్లా, నవిత, ప్రవళిక, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులకు ఇకెవైసి తప్పనిసరి

జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కె. రఘురాం

ప్రజాశక్తి - రాయచోటి



ముఖా ముఖి..

జిల్లాలోని రేషన్ కార్డుదారులు ఇకెవైసి తప్పని సరిగా చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కె. రఘురాం పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ప్రస్తుతం చౌక దుకాణాల్లో బియ్యం, చక్కెర సరఫరా చేస్తున్నారు. త్వరలో స్మార్ట్ రేషన్ కార్డులను అందజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. ప్రస్తుతం నూతన రేషన్ కార్డులకు కావాల నుకున్నవారు సచివా లయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాలో ఎన్ని రేషన్ కార్డులు, చౌక దుకాణాలు ఎన్ని ఉన్నాయి. కొత్త రేషన్‌కార్డులకు ఎలా దరఖాస్తులు ఎక్కడ చేసుకోవాలనే అంశాలపై ప్రజాశక్తి కి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో రేషన్ కార్డులు ఎన్ని, సభ్యులు ఎంతమంది ఉన్నారు?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 4,97,969 రేషన్ కార్డులున్నాయి. అలాగే 14,82,094 మంది రేషన్ కార్డు దారులున్నారు.

చౌక దుకాణలు ఎన్ని ఉన్నాయి? స్టాక్ పాయింట్లు ఎన్ని ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా 1123 చౌక దుకాణాలున్నాయి. అలాగే 12 స్టాక్ పాయింట్లున్నాయి.

ప్రతినెలా బియ్యం ఇతర వస్తువులు ఎన్ని క్వింటాళ్లు పంపిణీ చేస్తున్నారు?

జిల్లాలో రేషన్‌కార్డుదారులకు 72305.53 క్వింటాల్ బియ్యం అందిస్తున్నాం. 2531.495 క్వింటాల చెక్కర ప్రతి నెలా సరఫరా చేస్తున్నాం.

డీలర్లు ఎన్ని రోజులు వరకు సరుకులు పంపిణీ చేయవచ్చు? లబ్ధిదారులు ఏన్ని రోజులలో సరుకులు తీసుకోవాలి?

ప్రతి నెలా 1వ తేదీ నుచి 15 వరకు పంపిణీ ఉంటుంది. ప్రజలు కూడా ప్రతినెలా క్రమం తప్పకుండా రేషన్‌లోని సరుకులు తీసుకోవాలి. రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులు జిల్లాలో ఎక్కడైనా రేషన్ దుకాణాలలో సరుకులు తీసుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుంది.

అవినీతికి పాలపడుతున్న డీలర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో డీలర్లు అవినీతికి పాల్పడుతున్నట్లు తమకు ఇంత వరకు ఫిర్యాదులు రాలేదు. డీలర్ ఎవరైనా అవినీతికి పాల్పడుతున్నట్లు ప్రజలు ఎవరైనా ఫిర్యాదు చేస్తే అటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుని వారి పైన కేసులు నమోదు చేస్తాం.

రేషన్ కార్డు దరఖాస్తులు ఎన్ని వచ్చినాయి? నూతన కార్డులు ఎప్పుడు ఇస్తారు?

జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు నూతన రేషన్ కార్డుల కోసం 3,039 అర్జీలు వచ్చాయి. జూన్ మాసంలో కొత్త కార్డులు ఇవ్వచ్చు.

సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

గతంలో సిబ్బంది కొరత ఉండేది. ప్రస్తుతం పౌరసరఫరాల శాఖలలో సిబ్బంది కొరత లేదు.

ప్రజలకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

ప్రతినెలా 1వ తేదీ నుండి 15 వరకు రేషన్ దుకాణాలలో రేషన్ సరుకులు పొందవచ్చు. గతంలో ఉన్న ఇంటి ఇంటికీ సరఫరా చేస్తున్నటువంటి బియపు బండ్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. చౌక దుకాణాలలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రజలకు ఏమైనా సమస్య ఉంటే తమ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చు.

29న మహానాడుకు బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-రాయచోటి

ఈనెల 29న ఉదయం 10.30 గంటలకు గువ్వల చెరువు దగ్గర నుంచి కడప మహానాడు వరకు జరిగే బైక్ ర్యాలీ ని జయప్రదం చేయాలని రాష్ట్ర రవాణా, క్రీడ యువజన శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలలోని టిడిపి నాయకులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి బైక్ ర్యాలీ, మహానాడును జయప్రదం చేయాలని కోరారు.

'వెలుగు'లో వరల్డ్ స్కిజోఫ్రీనియా డే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని అమ్మచెరువుమిట్టలో వెలుగు సంస్థలో ఆదివారం మినిస్ట్రీ అఫ్ సోషల్ జస్టిస్, నేషనల్ ట్రస్ట్ వారి ఆదేశాల మేరకు వరల్డ్ స్కిజోఫ్రీనియా డేని నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా చార్టర్డ్ అకౌంటెంట్ కెఎస్‌ఎస్.ప్రసాద్, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లీనా కుమారి మాట్లాడుతూ వరల్డ్ స్కిజోఫ్రీనియా డేను మే 24వ తేదీన జరుపుకుంటున్నామని అన్నారు. ఈ స్కిజోఫ్రీనియా (మానసిక రుగ్మత) గురించి అవగాహనను కల్పించడం, మానసిక రుగ్మతతో బాధపడే వాళ్ళ కళంకాన్ని తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. మానసిక రుగ్మతతో బాధపడేవారు ఎక్కువగా ఒంటరిగా ఉంటూ, తమలో తామే మాట్లాడుకుంటూ, తమకు ఎవరి ద్వారా అయినా కీడు సంభవిస్తుందేమోననే భ్రమలతో ఉంటారని తెలిపారు. వీరి మెద డులోని న్యూరాన్ లు దెబ్బతినడం వలన, మెదడు హైపర్ సెన్సిటివిటికిలోను అవ్వడం వలన ఈ స్కిజోఫ్రీనియాకు గురికావడం జరు గుతుందని అన్నారు. వీరిలో ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే వారిని మానసిక ఆరోగ్య నిపుణులతో సంప్రదించి నట్లయితే మంచి ఆరోగ్యాన్ని ఇవ్వా చ్చని తెలిపారు. అనంతరం వెలుగు కన్వీనర్ భాగ్య లక్ష్మి మాట్లాడుతూ స్కిజోఫ్రీనియాతో బాధపడే వారిలో ఒక సమస్య వచ్చినపుడు దాని గురించే ఆలోచించడం వల్ల దాని ప్రభావం శరీరం మీద పడి అనారోగ్యానికి గురవుతారని అన్నారు. చార్టర్డ్ అకౌంటెంట్ కే. ఎస్.ఎస్ ప్రసాద్ మాట్లా డుతూ వృద్ధులందరు ఇక్కడ ఉన్న పిల్లలను మీ మనవళ్లు, మనుమరాళ్ళుగా భావించి వారికీ కథలు చెబుతూ, ఆటలు పాటలతో పిల్లల ందరితో కలిసి ఉంటే సంతోషంగా, ఆరో గ్యాంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ప్రిన్సిపాల్ పి.లీనాకుమారి, నర్స్ గీతాంజలి, వెలుగు సిబ్బంది, పిల్లలు , వృద్ధులు పాల్గొన్నారు.

డిజిఎం కళావతి అవినీతిపై విచారణ చేపట్టాలి : సిఐటియు

ప్రజాశక్తి-పుల్లంపేట



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్

ఓబులవారిపల్లి మం డల పరిధిలోని మంగంపేట ఎపిఎండిసి డిప్యూటీ మేనేజర్ కళావతి అవినీతిపై విచారణ జరపాలని ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవా ధ్యక్షులు సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, ఓబుల వారిపల్లి సిఐటియు మండల కార్యదర్శి నాగిపోగు పెంచలయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021 అక్టోబర్ నెల నుంచి 2024 ఫిబ్రవరి వరకు దాదాపు 45 వేల కిలోమీటర్ల ఎపిఎండిసి వెహికల్ విజయవాడ నుంచి హైదరాబాదుకి శుక్రవారం తీసుకెళ్లి సోమవారం వచ్చేవారని అప్రూవల్ లేకుండా ఎండి తప్ప ఎవరు వెహికల్ వాడుకునే అర్హత లేదన్నారు. ఈమెకు ఎవరు అప్రూవల్ ఇచ్చారో చెప్పాలని ఎపిఎండిసి నుంచి డీజిల్ వాహనము లక్షలాది రూపాయల డబ్బులు దుర్వినియోగం చేశారని అన్నారు. ఎపి ఎంబిసి అవుట్ సోర్సింగ్ కార్మికులు మృతి చెందిన కుటుంబాలకు ఇన్సూరెన్స్ 8మందికి ఒక్కొక్కరికి రూ.10 లక్షలు ఇవ్వకుండా బాధ్య తారాహితంగా విధులు నిర్వహి ంచారని అన్నారు. దీనిపై సిఐటియు ఫిర్యాదు చేయగా ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా 2024, ఆగస్టు 12న విచారణ జరపాలని ఆదేశించిన ఎందుకు విచారణ జరపలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో అవినీతి చేసిన అధికారులను కూటమి ప్రభుత్వం ఎందుకు కాపాడుతుందని అన్నారు. ఇప్పటికైనా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న ఉద్యోగ విరమణ ఉన్న కారణంగా ఆమె అన్ని రకాల రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిలుపుదల చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కంటి ఆపరేషన్లు చేయించుకున్న వృద్ధులు

29 మంది కంటి రోగులకు శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో గల లయన్స్ కంటి ఆస్పత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 29 మంది కంటి రోగులకు శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. రాజంపేట, రైల్వే కోడూరు, పీలేరు, కె.వి.పల్లి, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెం, కదిరి, చక్రాయపేట, ఎన్.పి.కుంట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 60 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కంటి వైద్యులు అందులో అర్హులైన 29 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 30 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు తెలి పారు. కంటి వైద్య శిబిరానికి హాజరైన కంటి రోగుల సౌకర్యార్థం దాతలు భోజనం వసతి కల్పిం చారు. కార్యక్రమంలో కంటి ఆస్పత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప్ గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, చెన్నముక్కపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, కంటి వైద్యులు సురేష్‌బాబు, భార్గవి, ఆప్తమాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఖాదర్‌బాషా

ప్రజాశక్తి-కలికిరి



వైసిపి మండలం మైనార్టీ సెల్ అధ్యక్షులుగా మేజర్ పంచాయతీ 9వ వార్డు మెంబెర్ వేంపల్లి ఖాదర్‌బాషా నియమితులు అయ్యారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ మండలంలో వైసిపికి పూర్వ వైభవం తెచ్చి మైనార్టీ నాయకులకు ఏకం చేసి పీలేరు నియోజకవర్గంలో మళ్లీ వైసిపి గెలుపు బాటకు కృషి చేస్తారని అన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి , మండల అధ్యక్షులు రమేష్, ఎంపిపి నూర్జహాన్ , నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలోని గండబోయనపల్లి గ్రామ దేవత శ్రీ సత్యమ్మ తల్లి గంగజాతరను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి జలాభిషేకం, పంచామృతాభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు. రాత్రి 7 గంటలకు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రాత్రి 12 గంటలకు అమ్మవారికి దీలుబోనాలు సమర్పించారు. సోమవారం ఉద యం 10:30 గంటలకు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అమ్మ వారి సేవలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ చైర్మన్ పులి సత్యనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులుపాల్గొన్నారు.


ముగిసిన మాతమ్మ..

వీరబల్లి : మండలంలోని పెద్ది వీడు పంచాయతీ మాదిగపల్లెలో వెలిసిన మాతమ్మ, గంగమ్మ, తల్లి జాతర ఆదివారం మహిళ తిరుణాలతో ఘనంగా ముగిసింది. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో ఆలయ ప్రాం గణం కిక్కరిసిపోయాయి. ఆసాది వారి కథ ప్రజలను ఆకట్టుకుంది. ఆలయ ధర్మకర్తలు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారు.

అక్కమ్మ దేవత సన్నిధిలో 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని వరదయ్యగారిపల్లెలో అక్కమ్మ దేవతను ఆదివారం తోట కేదార్నాథ్, మస్తాన్ ఆహ్వానం మేరకు రాజంపేట జనసేన పార్టీ పార్లమెంటు ఇన్చార్జి యల్లటూరు శ్రీనివాసరాజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం తో పాటు నియోజకవర్గం సుభిక్ష ంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్వహకులు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యల్లటూరు శివరామరాజు, జనసేన నాయకులు కోలాటం హరి, కార్యకర్తలు, పాల్గొన్నారు.



వేదికపై ఆశీనులైన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-కలికిరి

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక స్థానిక మండలం, మహల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) ప్రాంగణం సందడిగా మారింది. 2004 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సుదీర్ఘ విరామం తరువాత మళ్లీ ఒకే చోట కలవడం వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. పాఠశాలకి వచ్చిన పూర్వ విద్యార్థులు, తాము చదువుకున్న తరగతులను, గురువుల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా మమేక మయ్యారు. ఈ సమ్మేళనంలో అత్తావుల్లా, మారెళ్ల మహేష్, పాతమేకుల మహేశ్వర్ రెడ్డి, ఖాజా హుస్సేన్, నిశాంత్ రెడ్డి, రమేష్, రఫీ ఉల్లా తదితరులు పాల్గొన్నారు. వీరు సమ్మేళనం విజయవంతంగా జరిగేలా తాము తమకు తోచిన విధంగా సహకరించారు. కార్యక్రమ ఏర్పాట్లలో పరస్పర సహకారం, సమన్వయం స్పష్టంగా కనిపించింది. పూర్వ విద్యార్థులు తమ విద్యా కాలంలోని జ్ఞాపకాలను పంచుకుంటూ, ఈరోజు వారు ఏ విధంగా ఎదిగారో ఒకరినొకరు చూసి ఆనందించు కున్నారు. కొందరు తమ జీవిత ప్రయాణాల్లో సాధించిన విజయాలను అందరితో పంచుకుంటూ, మిగతావారికి ప్రేరణగా నిలిచారు. విద్యార్థులందరూ పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ మధుర సమావేశం చివర్లో భవిష్యత్తులో తరచూ ఇలాంటి సమ్మేళనాలను నిర్వహించాలనే నిర్ణయాన్ని తీసు కున్నారు. విందు కార్యక్రమంతో ఈ జ్ఞాపకాల సందడి ముగిసింది. పూర్వ విద్యా ర్థుల సమ్మేళనం ప్రతి ఒక్కరినీ గతాన్ని తలచుకుని భావోద్వేగపరుల్ని చేసింది.

అందరి సంస్థ 'మానవత'

ప్రజాశక్తి-కడప అర్బన్

అందరి సంస్థ మానవత అని వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో మానవతా నెలవారి సమావేశం డాక్టర్ సి. సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలు కలిగిన వ్యక్తుల సమూహమే మానవత అన్నారు. సభ్యత్వాలు మానవతా సంస్థ ప్రాణం అని, సకాలంలో సభ్యత్వాలు పూర్తి చేసి నిర్వాహకులు అందించాలని సూచించారు. కేంద్ర కమిటీ డైరెక్టర్ డాక్టర్ అవటాల రామాంజుల రెడ్డి ఈ వేసవిలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం దాతల సహకారంతో కొనసాగించామన్నారు. పబ్లిక్ రిలేషన్ అధికారి పప్పనబోయిన సుబ్బరాయుడు మాట్లాడుతూ సభ్యత్వాలు ఏడాది తప్పనిసరిగా పెంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ మద్దిక సుబ్బిరెడ్డి, కృష్ణారావు, బివి సుబ్బారాయుడు, బైరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడారు.

టెర్రకోట బొమ్మలకు ప్రసిద్ధి అంగళ్లు

- కళాకారుల అద్వితీయ కళానైపుణ్యం
- పోత్సహిస్తే మరింత ప్రాచుర్యం లభించే అవకాశం
- అంతరించిపోతున్న కళలను కాపాడుకోవాలి



విక్రయాలకు సిద్ధంగా ఉంచిన ఆకర్షణీయమై జాడీలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కురబలకోట మండలం,అంగళ్లు అనే ఊరు రాగానే దారికి రెండు వైపులా ఎర్రగా మెరుస్తూ ఆహ్వానం పలుకుతున్న టెర్రకోట బొమ్మలు, ఆ కుండీల్లో నిండి ఉన్న రంగురంగుల పువ్వులు దర్శన మిస్తాయి.మట్టిని కాల్చి వివిధ ఆకృతుల్లో బొమ్మలకు రూపం పోయ డం మనిషి నేర్చిన పురాతన కళల్లో ఒకటి.అంగళ్లు అనే ఈ గ్రామం మదన పల్లె పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. కడప, కదిరి, మదనపల్లె జాతీయ రహదారి మార్గ కూడలి ఎంబిటి రోడ్డుకు ఇరువైపులా వీరి బొమ్మల అంగళ్లను ఏర్పాటు చేసుకున్నారు.ఆ జాతీయ రహదారి గుండా రాకపోకలు సాగించే చాలామంది ఇక్కడ కాసేపు ఆగి, వీరు తయారు చేసి అ మ్ముతు న్న బొమ్మలను కొనుగోలు చేస్తుం టారు.ఆ బొ మ్మలు చూపరులను ఎంతగానో ఆకటు కుంటాయి.టెర్రకోట అనేది కాల్చిన మట్టితో తయారు చేసే కళారూపం. ఇక్కడి కళాకారులు సొంతంగా మట్టిని శుద్ధిచేసి అందమైన బొమ్మ లకు రూపం అందిస్తూ జీవనోపాధిని కొనసా గిస్తున్నారు. స్థానికంగానే ఈ బొమ్మలన్నీ తయార వుతున్నాయి.ఈ వృత్తికి మరింత తోడ్పాటు అందించేందుకు బ్యాంకుల నుంచి కూడా ఆర్థిక సహాయం లభిస్తోంది. వీరు ఒకే సామాజిక వర్గా నికి చెందినవారు కావడంతో కుటుంబ వాతా వరణంలో కలిసిమెలిసి పని చేస్తూ సంప్రదాయ కళను కొనసా గిస్తున్నారు. దారిలో వెళ్తూ మధ్యలో ఆగి తమ వద్ద బొమ్మలు కొనుగోలు చేసే వారికి వీరు ఆత్మీ యంగా ఆ బొమ్మల గురించి చెప్పి తక్కువ ధరలకు అందజేస్తు న్నారు. ఏను గులు, గుర్రాలు, నెమళ్లు, పక్షులు, కుం దేళ్లు, దీప స్తంభాలు, ఊర గాయ జాడీలు, పూల కుండీలు, అలం కరణ సామగ్రి, శివుడు, వినాయ కుడు, గౌతమ బుద్ధుడు, శ్రీకృష్ణుడు, షిరిడి సాయి వంటి దేవత మూర్తుల ప్రతిమ లు అనేక రకాల టెర్రకోట మట్టి బొమ్మలు చూడ ముచ్చటగా ఆకట్టు కుంటు న్నాయి. ఆ దారిన వెళ్లేటప్పుడు అంగళ్లు వద్ద కాసేపు ఆగి ఆ కళాకారులను ప్రోత్స హించడం భారతీయ సం స్కృతికి నిదర్శనం. మట్టితో బొమ్మలను తయారు చేస్తూ జీవం నింపుతున్న పురాతన కళలకు చేయూతనివ్వాలని వారు కోరుతున్నారు. ప్రస్తు_తం సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయి చేతి వృత్తి దారుల ప్రావీ ణ్యం మరుగున పడిపోయే ప్రమా దం ఏర్పడిం దని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభు త్వాలు ఇంత అద్భుత నైపుణ్యం కలిగిన చేతివృత్తి దారులను ప్రోత్స హిస్తే భారతీయుల కలల ప్రాచర్యం మరింత పెరిగే అవకాశం ఉంది. ఇటు వంటి కళా నైపు ణ్యాలు మనకు తెలియనివి ఎన్నో ఉన్నాయి. వాటిని వెలుగులోకి తీసుకొస్తే భారతీ యుల గొప్పతనం ఏమిటో ప్రతి ఒక్కరికి స్పష్టంగా అర్థమ వుతుం దని విశ్లేషకులు అభిప్రా యపడుతున్నారు.



బ్యాంక్ రుణంతో ఏర్పాటు చేసిన షాపు



మట్టి బొమ్మలను పరిశీలిస్తున్నకొనుగోలు దారుడు

నిరుపయోగంగా చెత్త తయారీ కేంద్రాలు



నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

ప్రజాశక్తి-గాలివీడు

చెత్త నుంచి సంపద తయారు చేయాలనే సంకల్పంతో 2017లో మండంలోని ప్రతి గ్రామంలో చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిని వినియోగంలోనికి తీసుక రాకపోవడంతో నిరుపయోగంగా మారాయి. మండలంలో 17 గ్రామపంచాయతీలు ఉన్నాయి ప్రతి గ్రామంలో కూడా తడి చెత్త, పొడి చెత్తను సేకరించి నిల్వ ఉంచి అక్కడ ఎరువు తయా రు చేయడానికి ప్రభుత్వం సంకల్పించింది. అప్పటినుంచి ఇప్పటి వరకు నిరుపయోగంగానే ఉన్నాయి. స్థానిక ఇఒపిఆర్‌డి కార్యాలయంలో ప్రజలకు పంపిణీ చేయాల్సిన డస్ట్‌బిన్‌లు కూడా కొన్నేళ్ల నుంచి మూలన పడ్డాయి. డస్ట్‌బిన్‌లను ప్రజలకు పంపిణీ చేసి ఉంటే ప్రజలు తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించే వారని, వాటి వల్ల చెత్త నుంచి సంపద కేంద్రాలు పనిచేసేవని ప్రజలు చెబుతున్నారు. పంచాయతీ కార్యద ర్శులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల చెత్త సంపద తయారీ కేం ద్రాలు నిరుపయోగంగా మారాయని చర్చించుకుంటున్నారు. ఇప్ప టికైనా అధికారులు దృష్టి పెట్టి వాటిని వినియోగంలోనికి తేవాలని కోరుతున్నారు.



మూలనపడ్డ డస్ట్‌బిన్‌లు

28న మెగా యోగాకు పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్



బిటి కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈనెల 28న నిర్వహించే మెగా యోగా కార్యక్రమానికి అన్ని శాఖలు సమన్వయంతో పటిష్టంగా ఏర్పాట్లు పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. ఆదివారం మదనపల్లె బెంగళూరు రోడ్డులోని బిటి కళాశాల మైదానాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. 28న అక్కడ నిర్వహించనున్న మెగా యోగ కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో వివిధ అంశాలలో చర్చించారు. మైదానంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. యోగా చేయడానికి అణువుగా మైదానంలో మ్యాట్ ఏర్పాటు చేయాలని, వచ్చిన వారందరికీ తాగునీటి ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. శిక్షకులు చెప్పే యోగాసనం అందరికీ వినపడేలా మైక్ ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో పాల్గొనే అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఎఎన్ఎంలు, మెడికల్ అధికారులు, ఆశాలు క్రమశిక్షణతో సంఘటితంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అధికారులు అవగాహన కల్పించా లన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, చేపట్టాల్సిన చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు. అనంతరం వివిధ అంశాలలో చర్చించి తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేం ద్రన్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహశీల్దార్ ధనుంజయులు, ఐసిడిఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

నవోదయకు 'శ్రీభువన' విద్యార్థులు ఎంపిక



11వ తరగతికి సీట్లు సాధించిన శ్రీ భువన విద్యాలయం విద్యార్థులు

ప్రజాశక్తి-పీలేరు

జవహర్ నవోదయ విద్యాలయానికి పీలేరు శ్రీభువన విద్యాలయం విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థ కరస్పాండెంట్ ఉమా రమాదేవి, ప్రిన్సిపల్ గుణలక్ష్మి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను జవహర్ నవోదయ 11వ తరగతిలో ప్రవేశానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రవేశ పరీక్ష జరిగింది. ఆదివారం విడుదలైన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 27 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. వారిలో శ్రీ భువన విద్యాలయం నుంచి వై.జగన్మోహన్‌రెడ్డి, ఎస్.సుశాంత్, ఎ.ప్రశాంత్, ఎ.లోకేష్ 11వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విద్యాలయానికి చెందిన నలుగురు విద్యార్థులు 11వ తరగతిలో సీట్లు సాధించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులు బాగా చదివి పోటీ పరీక్షల్లో తమ సత్తా చాటుతూ సీట్లు సాధించాలని, తాము చదువుకునే విద్యా సంస్థతోపాటు గురువులకు, తల్లిదండ్రులకు కూడా మంచి పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి తోడ్పాటు అందించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. సీట్లు సాధించిన నలుగురు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో శ్రీ భువన విద్యాలయం ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బాస్ రాష్ట్ర అధ్యక్షులు గణపతికి సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇటీవల గుంటూరులో జరిగిన బాస్ రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో వి.కోటకు చెందిన ఉలగనాథన్ గణపతి రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నియ్యారు. రాయలసీమ జిల్లాల నుంచి మరో 24 మంది రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. పట్టణలోని ఒక ఫంక్షన్ హాల్లో ఆదివారం వీరికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్ణాటక ప్రభుత్వ జానపద అకాడమీ చైర్మన్ గొల్లహళ్లి శివప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్‌తో కలిసి రాష్ట్ర అధ్యక్షులు గణపతి తో పాటు రాయలసీమ జిల్లాల నుండి రాష్ట్ర కమిటీకి ఎన్నికైన ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. వీరిని దుశ్శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి, అంబేద్కర్ చిత్రపటంతో ప్రత్యేకంగా రూపొం దించిన జ్ఞాపికను బహూకరించారు.అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ కారంచేడు దళితులపై జరిగిన నరమేధం తర్వాత ఆంధ్రప్రదేశ్ లో ఉధృతం గా సాగిన దళిత ఉద్యమానికి, కర్ణాటక రాష్ట్రం నుంచి దళిత సంఘర్షణ సమితి అండగా నిలిచిందని గుర్తు చేశారు. కుల ఉద్యమాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లో బలహీన పడిన దళిత ఉద్యమాన్ని తిరిగి బలోపేతం చేయడానికి భారతీయ అంబేడ్కర్ సేన చేపట్టిన సైద్ధాంతిక ఉద్యమం, ఎంతో గొప్ప లక్ష్యంతో పనిచేస్తోందని అన్నారు. శివప్రసాద్ మాట్లాడుతూ సమగ్ర సామాజిక విప్లవం కోసం విశాల ప్రజా సమూహాలను ఐక్యం చేస్తూ, భారతీయ అంబేడ్కర్ సేన చేపట్టిన సంఘ సంస్కరణ ఉద్యమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, అంబేద్కర్ ఆశయాల సాధనకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. సన్మానం అందుకున్న వారిలో రాష్ట్ర అధ్యక్షులు గణపతి, రాధ దంపతుల తోపాటు రాయలసీమ జిల్లాల నుండి స్టేట్ కమిటీకి ఎన్నికైన ప్రతినిధులు పాలకుంట శ్రీనివాసులు (పీలేరు), పల్లం తాతయ్య (రాయచోటి), నీరుగట్టి రమణ (మదనపల్లి), ముత్యాల మోహన్ (తంబళ్లపల్లి), టి.ఎ. పీర్ బాషా (మదనపల్లి), మల్లె మొగ్గల ఉమాపతి (తిరుపతి), రమణయ్య (కడప) మద్దిలేటి ప్రమీల (నంద్యాల), జెన్నె ఆనంద్ (అనంతపురం), వి.దొరస్వామి (చిత్తూరు), బాలకృష్ణ(కుప్పం), మహేష్ (కర్నూల్), విజయ్‌కుమార్ (పూతలపట్టు), నరసింహ (జమ్మలమడుగు), వాసు(చంద్రగిరి) తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బాస్ కేంద్ర కమిటీ ప్రతినిధులు ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, బురుజు లక్ష్మీనారాయణ, కె.వి. రమణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డిఆర్ఒ విశ్వేశ్వరనాయుడు

ఆధ్యాత్మిక సాహిత్య శిల్పి మల్లికార్జునరెడ్డి

-డిఆర్ఒ ఎం. విశ్వేశ్వరనాయుడు

ప్రజాశక్తి - కడప అర్బన్

రామాయణ, భారత, భాగవతాల్లోని పాత్రలను ఆధునిక దృక్పథంతో తీర్చి దిద్దిన ఆధ్యాత్మిక సాహిత్య శిల్పి ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు కొనియాడారు.ఆదివారం ఉదయం శ్రీ రామకృష్ణ వన ప్రస్థాశ్రమం, శ్రీ రామకృష్ణ సేవా సమితి కడప (ఆధ్యాత్మిక జ్ఞాన మందిరం)లో ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి రచించిన ' రామాయణ, భారత, భాగవతాల్లో కొన్ని పాత్రలు' పుస్తక పరిచయ సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఆర్ఒ మాట్లాడుతూ ఈ గ్రంథంలో మల్లికార్జున ఒడ్డి వినాయకుని వైభవాన్ని, పురంజన, కపిలోపాఖ్యానాల్లో ఉన్న అంతరార్థాలను, దివ్యాంశ సంభూతుడైన హనుమంతుని చరిత్రను, త్యాగానికి ప్రతీకగా భరతుడు, మానవత్వానికి మిత్రత్వానికి సంకేతం గా నిలిచిన సుమిత్ర పాత్రలను అద్భు తంగా మలిచారన్నారు. సభాధ్యక్షులుగా వ్యవహరించిన బాబు రెడ్డి మాటా డుతూ అచ్చమైన జ్ఞానానందం పొందడానికి మల్లికార్జున రెడ్డి యోగ్యమైన ఆధ్యా త్మిక మార్గాన్ని ఎన్నుకున్నారని అన్నారు. విశిష్ట అతిథి జీ వెంకట సుబ్బారెడ్డి తన ప్రసంగం లో మహా గ్రంథాల్లోని కొన్ని పాత్రలను స్వీకరించి ఇప్పటి కాలంలో ఆ పాత్రల ప్రయోజనం ఏమిటో వివరించి చెప్పారన్నారు. మరో అతిథి బి శివరామిరెడ్డి మాట్లాడుతూ రామాయణ, భారత, భాగవతాలు ఏ కాలానికి చెందిన వైన పూజనీయమైనవేనని మల్లికార్జున రెడ్డి వాటిలో పది పాత్రలు తీసుకుని అద్భుతంగా రాశారన్నారు. ఆత్మీయ అతిథి లెక్కల కొండారెడ్డి మాట్లాడుతూ మల్లికార్జున రెడ్డి జిల్లాలో ఎన్నో సాహిత్య కార్యక్రమాలు చేస్తూ కూడా మరెన్నో విలువైన గ్రంథాలను రాశారని ప్రశంసించారు. అతిథులను ఘనంగా సన్మానించారు. ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి స్పందిస్తూ పురాణ పాత్రలను నేటి కాలానికి అన్వయిస్తూ ఈ వ్యాసాలను రాశారని, ప్రతి ఒక్కరి జీవితంలో ఈ పాత్రలతో ఏదో ఒక విధంగా సమన్వయం ఉంటుందని, జ్ఞానబోధ తో పాటు ఉత్తమ జీవన విధానానికి ఈ పాత్రలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తవ్వా వెంకటయ్య, జీవ కళ సత్యనారాయణ, బళ్లాని శివరాం, నాగిరెడ్డి, వనప్రాస్థశ్రమ సభ్యులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు జిపిఎఫ్ వర్తింపజేయాలి

ప్రజాశక్తి-రాయచోటి

విద్యుత్‌శాఖలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన ఉద్యోగులందరికీ జిపిఎఫ్ స్కీమ్ వర్తింపజేయాలని ఉద్యోగులు ఆదివారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మంత్రి ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

క్రైం కార్నర్



షాపులోకి దూసుకుపోయిన ఇన్నోవా కారు

అదుపుతప్పి అంగడిలోకి దూసుకెళ్లిన కారు

-మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

కడప-రేణిగుంట జాతీయ రహదారిపై మండలంలోని రామక్కపల్లి గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ తీవ్రంగా గాయపడ్డారు. తిరుప నుంచి కడపకు వెళ్తున్న ఇన్నోవా వాహనం పుల్లంపేట మండలం రామక్కపల్లె సమీపంలోకి రాగానే రాంగ్ రూట్లో వచ్చి ఆంజనే యస్వామి గుడి పక్కనే ఉన్న సెంట్రింగ్ షాపులోకి అతివేగంగా ఢీకొనడంతో షాపులో ఉన్న ఫ్రిడ్జి, సామగ్రి ధ్వంసం కాగా షాప్ లోనే ఉన్న సిగమాల లక్ష్మీదేవి అనే మహిళకు కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌ను అదు పులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు పుల్లంపేట ఎస్ఐ శివకుమార్ తెలిపారు. బతుకుదెరువు నిమిత్తం సెంట్రింగ్ సామగ్రి పెట్టుకొని జీవిస్తుండగా కారు ఢీ కొనడంతో షాపు లోపల సామగ్రి ధ్వంసమైన సుమారు రెండు లక్షల రూపా యలు ఆస్తి నష్టం సంభవించిందని బాధితురాలు కన్నీటి పర్యంతమయ్యారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- మరో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-కలకడ

విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని రాతికుంటపల్లి పంచాయతీ ఎగువబట్టవారిపల్లి వద్ద ఉన్న చెరువులో వ్యవసాయ భూములకు అడవి పందులు వచ్చి పంట పొలాలకు నష్టం చేస్తున్నాయని చల్లా చంద్రయ్యానాయుడు అనే వ్యక్తి తమ పొలం బీడు భూములలో విద్యుత్ తీగలను ఏర్పాటు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ తీగలను గుర్తించని కడప జిల్లా బ్రహ్మంగారిమఠం వడ్డివానిబావికు చెందిన మురళీ(25) విద్యుత్ తీగల తగిలి మృతి చెందాడని తెలిపారు. అతని వెంట వచ్చిన పామూరు సమీపంలో ఉన్న గురవాయిపేటకు చెందిన నారాయణకు కుడి,ఎడమ చేతులు, ఎడమ చేయి తలభాగం పూర్తిగా గాయాలు కావడంతో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడ నుంచి మెరుగని చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించినట్లు తెలిపారు. వీరు మండలంలో ఉన్న గ్రామాలలో ముళ్ళ చెట్లను నరికి బొగ్గులు తయారు చేసి అమ్మకాలు చేసి వ్యాపారం నిమిత్తం ఇక్కడికి వచ్చారని అన్నారు. సంబేపల్లి మండలం ఎస్.సోమవారం గ్రామ సమీపంలో నివాస ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదు చేయగా, పీలేరు సిఐ యుగంధర్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై దాడి : పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పాత కక్షలతో వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..మండలంలోని గొల్లపల్లి గ్రామంలో నివాసమున్న వీరప్ప గొల్లపల్లి బస్టాండ్‌లో చిల్లర దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. వీరి దాయాదైన వెంకటేశ్వర అనే వ్యక్తి పాతకక్షలు, భూమి వివాదం ఉన్నందున వీరప్పని అసభ్యకరంగా దూషించి దాడి చేశారని తెలిపారు. అడ్డు వచ్చిన వీరయ్య తండ్రి నారాయణను, భార్య విజయలక్ష్మిని దూషించి బెదిరించినట్లు తెలిపారు. వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్థల వివాదంపై కేసు నమోదు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని అరవీడు పంచాయతీ ఉయ్యాలవాండ్లపల్లిలో స్థల వివాదంలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.శ్రీరాములు తెలిపారు. గ్రామంలో నివాసముండే లక్ష్మీదేవి భర్త రాజగోపాల్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన మధుక ర్‌రెడ్డి , రెడ్డప్పరెడ్డి, రమణారెడ్డి శనివారం దాడి చేశారని ఆదివారం వరలక్ష్మిదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.